# సమసమాజ స్వాప్నికుడు గద్దర్‌కు ఘన నివాళి

**ఆయన ఆశయాలు భావితరాలకు స్ఫూర్తి**
**: డా. మార్షల్ దుర్గం నగేష్**

**అగ్నిధార న్యూస్,(రామగుండం):**

ప్రజాకవి గద్దర్ జీవితం సమసమాజ నిర్మాణం కోసం సాగిన నిరంతర పోరాటమని, ఆయన ఆశయాలు భావితరాలకు చిరస్మరణీయ స్ఫూర్తిగా నిలుస్తాయని సమతా సైనిక్ దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, సమత ఫౌండేషన్ చైర్మన్ డా. మార్షల్ దుర్గం నగేష్ అన్నారు. గద్దర్ మూడో వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దళిత కుటుంబంలో జన్మించిన గుమ్మడి విఠల్‌రావు ప్రజాకవి గద్దర్‌గా కోట్లాది ప్రజల గుండెల్లో శాశ్వత స్థానం సంపాదించారని పేర్కొన్నారు. జానపద కళను ప్రజా చైతన్యానికి ఆయుధంగా మలుచుకుని సామాజిక న్యాయం, సమానత్వం, పీడిత ప్రజల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన మహోన్నత వ్యక్తిగా గద్దర్ నిలిచిపోయారని కొనియాడారు. తెలంగాణ ఉద్యమానికి గద్దర్ పాటలు అపారమైన శక్తిని అందించాయని, ఉద్యమ చరిత్రలో ఆయన పాత్ర చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ, అణగారిన వర్గాల ఆత్మగౌరవం, సామాజిక మార్పు కోసం ఆయన సాగించిన పోరాటం నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. గద్దర్‌పై కాల్పులు జరిగినా ఏమాత్రం వెనుకడుగు వేయకుండా ప్రజల మధ్యే ఉంటూ తన పాటలతో ఉద్యమాలకు ఊపిరినిచ్చిన ధైర్యవంతుడని తెలిపారు. "కళ ప్రజల కోసమే" అనే భావజాలంతో ఆయన రచించిన గేయాలు నేటికీ ప్రజల్లో చైతన్యాన్ని రగిలిస్తున్నాయని అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం కూడా సామాజిక తెలంగాణ సాధనే లక్ష్యంగా ప్రజల పక్షాన నిలిచిన గద్దర్, సమానత్వ సమాజం కోసం చివరి శ్వాస వరకు కృషి చేశారని పేర్కొన్నారు. గద్దర్ భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన పాటలు, ఆశయాలు, పోరాట స్ఫూర్తి ప్రజల గుండెల్లో




చిరస్థాయిగా నిలిచి తరతరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని డా. మార్షల్ దుర్గం నగేష్ తెలిపారు.

# తల్లి పాలే శిశువు ఆరోగ్యానికి తొలి రక్షణ

**అగ్నిధార న్యూస్ (రామగుండం):**

పుట్టిన శిశువుకు తల్లి పాలే సంపూర్ణ ఆరోగ్యానికి తొలి అడుగని, తొలి ఆరు నెలలు పూర్తిగా తల్లి పాలు మాత్రమే ఇవ్వాలని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి సూచించారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 4వ డివిజన్ స్వాగత్ ఫంక్షన్ హాల్‌లో సీడీపీఓ అలేఖ్య ఆధ్వర్యంలో గురువారం తల్లి పాల వారోత్సవాల సందర్భంగా అక్షరాభ్యాసం, అన్నప్రాశన, శ్రీమంతం కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మేయర్ మహంకాళి స్వామి మాట్లాడుతూ, తల్లి పాలు శిశువుకు అమృతంతో సమానమని, అవి రోగనిరోధక శక్తిని పెంపొందించి ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు దోహదపడతాయని అన్నారు. గర్భిణీలు, బాలింతలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



వహించాలని, అంగన్వాడీ కేంద్రాలు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తల్లి పాల ప్రాధాన్యంపై సమాజంలో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. 4వ డివిజన్ కార్పొరేటర్ కంకణాల మౌనిక రాజు మాట్లాడుతూ, తల్లి పాల వారోత్సవాల ద్వారా తల్లుల్లో అవగాహన పెంపొందించడంతో పాటు అక్షరాభ్యాసం, అన్నప్రాశన, శ్రీమంతం వంటి సంప్రదాయ కార్యక్రమాలను ఒకే వేదికపై నిర్వహించడం అభినందనీయమన్నారు. పిల్లల ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం ప్రతి కుటుంబం తల్లి పాల ప్రాముఖ్యతను గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో 7వ డివిజన్ కార్పొరేటర్ వేగొళపు రమాదేవి, 5వ డివిజన్ కార్పొరేటర్ సత్యప్రసాద్, సూపర్‌వైజర్ జాముున, ఇన్‌చార్జి అనిల్, అంగన్వాడీ సిబ్బంది బి. మంజుల, బి. శ్రీవాణి, ఎస్. రజిత, కే. అరుణ, బి. రాజలక్ష్మి, బి. సరోజ, కే. నర్మద, కే. స్వరూప, ఆశా వర్కర్లు, గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు, స్థానికులు పాల్గొన్నారు.

## చుండూరు అమరవీరులకు ఘన నివాళులు

**దళితులపై దాడులు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలి**
**: ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం**

**అగ్నిధార న్యూస్,( రామగుండం):**

చుండూరులో జరిగిన దళితుల ఊచకోత ఘటనను మరువలేమని, అమరవీరులకు న్యాయం జరిగేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. చుండూరు ఘటన జరిగి 35 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా గురువారం గోదావరిఖని తెలంగాణ అంబేద్కర్ ట్రస్ట్ భవన్‌లో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో చుండూరు అమరవీరులకు ఘన నివాళులర్పించారు. పెద్దపల్లి జిల్లా కో-కన్వీనర్ ఆకునూరి బాల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కుల వివక్ష, కుల అహంకారంతో మాల సామాజిక వర్గానికి చెందిన ఎనిమిది మందిని అత్యంత కిరాతకంగా హత్య చేయడం దేశ చరిత్రలో మాయని మచ్చగా మిగిలిపోయిందన్నారు. ఘటన జరిగి మూడు దశాబ్దాలకు పైగా గడిచినా బాధిత కుటుంబాలకు పూర్తి స్థాయిలో న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని, చుండూరు అమరవీరుల త్యాగాలను భావితరాలు స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి ప్రతినిధి ఈదునూరి పద్మ, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు, జాతీయ కార్యదర్శి కొంకటి లక్ష్మణ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మైస రాజేష్, కాంపెల్లి సతీష్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, బొచ్చు శంకర్, జనగామ రాజనర్సు, గద్దల శశిభూషణ్, బూడిద సమ్మయ్య, మేకల సురేష్, పుల్లూరి మహేందర్, పంజా అశోక్, కాంపెల్లి జీవన్ కుమార్, రామగిరి రమేష్, జిలకర రామస్వామి తదితరులు పాల్గొన్నారు. చుండూరు ఘటనపై ఈదునూరి పద్మ, జనగామ రాజనర్సు ఆలపించిన పాటలు సభలోని పలువురిని భావోద్వేగానికి గురిచేశాయి. కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం, మున్సిపల్ కార్పొరేషన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దుందుభి నది వంతెనను పూర్తి చేయాలి




**నిరసన తెలిపిన సిపిఐ నియోజకవర్గ ఇంచార్జి పులిజాల పరశురాములు.**

**అగ్నిధారన్యూస్ (కల్వకుర్తి)**

ప్రజల కోసం ప్రజలతో కలిసి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సిపిఐ ప్రచార యాత్ర లో భాగంగా భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ సమితి పిలుపు మేరకు ఆగస్టు 6 నుండి 14వ తేదీ వరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార ప్రచార యాత్రను రఘుపతిపేట్ గ్రామంలో సిపిఐ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి పులిజాల పరశు రాములు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రామగిరి రఘుపతి పేట్ మధ్యన ఉన్న దుందుభి నది పై పనులు ప్రారంభం చేసి మూడు సంవత్సరాలు గడుస్తున్న నేటికీ వంతెన నిర్మాణ పనులు పూర్తి కాలేదని అన్నారు. వర్షాకాలంలో దుందుభి ప్రవహిస్తున్నప్పుడు ప్రయాణికులు బైక్ ల పై వెళ్లి జారిపడి కాలు చేతులు విరుగొట్టుకున్నారని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే స్పందించి ఆగిపోయిన బ్రిడ్జి పనులను వెంటనే కొనసాగించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను విమర్శిస్తూ, పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, రైతు-కూలీల సమస్యలు, విద్యా--వైద్య పేదలకు అందుబాటులో ఉండాలని లింగసానిపల్లి, గుండూరు, సుద్దకల్, వేపూర్, బెక్కెర. తోటపల్లి గ్రామాలలో విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు గడ్డం శ్రీనివాస్, యేసు, బాలస్వామి, గోపాల్, తిరుపతి, కృష్ణ, బాలీశ్వర్, బాలయ్య, బాలరాజు హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు,

## ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలు యువతకు స్ఫూర్తి

**అగ్నిధార న్యూస్,( రామగుండం):**



తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం అహర్నిశలు కృషి చేసిన ఆచార్య ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ ఆశయాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా గురువారం స్నేహ సాహితీ గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకతను ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. ప్రత్యేక తెలంగాణ సాధన కోసం తన జీవితాన్ని అంకితం చేసి, ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని నింపిన మహనీయుడిగా ఆయన చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని అన్నారు. 1969 తెలంగాణ ఉద్యమం, నాన్-ముల్కీ ఉద్యమం, "ఇడ్లీ-సాంబార్ గో బ్యాక్" ఉద్యమం, మలిదశ తెలంగాణ ఉద్యమం వంటి పలు ఉద్యమాల్లో చురుకుగా పాల్గొని, దేశవ్యాప్తంగా వివిధ వేదికలపై తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించి ప్రజలను చైతన్యపరిచారని తెలిపారు. ఆరు దశాబ్దాల పాటు తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను ప్రజల్లో బలంగా నాటిన మహోన్నత వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏలేశ్వరం వెంకటేశం, పుట్ట రాజన్న, ఎరుకల పోషన్న (మాజీ ఎస్ఐ), జే.వి. రాజు, కే. సత్యనారాయణ, రామ్మూర్తి, రవి, వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

## డయాలసిస్ యంత్రాలు, బెడ్లు పెంచాలి

**సింగరేణి కార్మికులకు ప్రత్యేక ఐసీయూ బెడ్లు ఏర్పాటు చేయాలి**
**: మద్దెల దినేష్**

**అగ్ని ధార న్యూస్,( రామగుండం):**

గోదావరిఖని సింగరేణి ఆర్జీ-1 ఏరియా ఆస్పత్రిలో డయాలసిస్ యంత్రాలు, బెడ్ల సంఖ్యను 50కు పెంచాలని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేష్ డిమాండ్ చేశారు. అలాగే సింగరేణి మెడికల్ కళాశాల అనుబంధ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో సింగరేణి కార్మికులు, వారి కుటుంబ సభ్యుల కోసం ప్రత్యేకంగా 50 ఐసీయూ బెడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, సింగరేణి వ్యాప్తంగా గోదావరిఖని, భూపాలపల్లిలో మాత్రమే డయాలసిస్ సేవలు అందుబాటులో ఉండటంతో బెల్లంపల్లి, మందమర్రి, శ్రీరాంపూర్, 8వ ఇంక్లైన్, సెంటినరీ కాలనీ తదితర ప్రాంతాల నుంచి వచ్చే కిడ్నీ రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఐదు డయాలసిస్ యంత్రాలు సరిపోవడం లేదని, 12 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన యంత్రాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని పేర్కొన్నారు. పారిశ్రామిక కాలుష్యం కారణంగా కిడ్నీ వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం యాజమాన్యం బాధ్యత అని అన్నారు. డయాలసిస్ సకాలంలో అందకపోతే కిడ్నీ రోగుల ప్రాణాలకు ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గోదావరిఖని ఏరియా ఆస్పత్రిలో డయాలసిస్ బెడ్లు, యంత్రాల సంఖ్యను 50కు పెంచడంతో పాటు పాత యంత్రాలను వెంటనే మార్చాలని కోరారు. సింగరేణి సీఎస్ఆర్, డీఎంఎఫ్‌టీ నిధులను కార్మికుల ఆరోగ్య సేవలకే వినియోగించాలని, రూ.520 కోట్లతో నిర్మించిన గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రిలో సింగరేణి కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు ప్రత్యేకంగా 50 ఐసీయూ బెడ్లు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. సింగరేణి అభివృద్ధికి దశాబ్దాల పాటు శ్రమించిన కార్మికుల ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయవద్దని కోరిన ఆయన, సమస్యలు పరిష్కరించకపోతే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా కొండోజు అశోక్ చారి బాధ్యతలు స్వీకారం

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

హైదరాబాద్: హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా కొండోజు అశోక్ చారి బాధ్యతలు స్వీకరించారు. హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ జాతీయ చైర్మన్ నందన్ నరసింహ రావు ఆదేశాల మేరకు అశోక్ చారిని రాష్ట్ర అధ్యక్షులుగా నియమించడం జరిగింది. నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం తుర్కలపల్లి గ్రామానికి చెందిన కొండోజు అశోక్ చారిని గ్రామస్తులు అభినందించారు, ఈ సందర్భంగా పలువురు సామాజిక, రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు ఆయనకు హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. మానవ హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం, ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన నాయకత్వంలో సంస్థ మరింత అభివృద్ధి చెందుతూ విశిష్ట సేవలు అందించాలని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మానవ హక్కుల పరిరక్షణ, బాధితులకు న్యాయం, ప్రజల్లో చట్టాలపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని ఈ సందర్భంగా కోరారు.

## తల్లి పాల వారోత్సవాలపై అవగాహన

**అగ్నిధార న్యూస్ ,**
**(అంతర్గాం), ఆగస్టు 6:**



తల్లి పాల వారోత్సవాల సందర్భంగా అంతర్గాం మండలం సోమనపల్లి గ్రామంలో గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా మహిళా సాధికారత కేంద్ర కోఆర్డినేటర్ దయా అరుణ, పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్ కె. అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించి మహిళలు, గర్భిణీలు, బాలింతలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళా శిశు సంక్షేమ శాఖ అందిస్తున్న సేవలు, అత్యవసర టోల్‌ఫ్రీ నంబర్లు 1098, 181, 14567, 155326, 112, 1908 వినియోగం, ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలపై వివరించారు. అలాగే లేబర్ కార్డు ప్రయోజనాలు, బాలింతలు తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలు, శిశువులకు తల్లిపాల ప్రాధాన్యత గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుంట బాపు, ఉప సర్పంచ్ సత్యనారాయణ, కోరొబార్ రాజలింగు, పంచాయతీ కార్యదర్శి కిశోర్, వార్డు సభ్యులు, ఆశా వర్కర్, ఏఎన్ఎం రత్న, అంగన్‌వాడీ టీచర్ శశికళ, వీఓఏ, గర్భిణీలు, బాలింతలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఎన్టీపీసీలో భక్తిశ్రద్ధలతో బోనాల వేడుకలు



**అగ్నిధార న్యూస్,( రామగుండం):**

రామగుండం ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లో బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో కోలాని కవిత, వార్డు కౌన్సిలర్ వెంకట్‌రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి బోనాలు సమర్పించి, రాష్ట్ర ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని ప్రార్థించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో జరుపుకోవడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీపీసీ కుటుంబ సభ్యులు, మహిళలు, యువత, చిన్నారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో ఎమ్మెల్యే భేటీ

**అగ్నిధారన్యూస్,( రామగుండం):**



రామగుండం నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ గురువారం సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసిన ఎమ్మెల్యే, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నియోజకవర్గ అభివృద్ధి పనుల పురోగతిపై చర్చించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ప్రతిపాదిత మెగావాట్ల పవర్ ప్లాంట్ నిర్మాణం, ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటు, రైల్వే ఓవర్ బ్రిడ్జిల (ఆర్ఓబీలు) నిర్మాణంతో పాటు ఇతర అభివృద్ధి పనులకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుంచి అవసరమైన అనుమతులు త్వరితగతిన మంజూరై పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రధాన కార్యదర్శిని ఎమ్మెల్యే కోరారు. ఎమ్మెల్యే ప్రస్తావించిన అంశాలను సానుకూలంగా పరిశీలించిన ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సంబంధిత శాఖలతో సమన్వయం చేసి అభివృద్ధి పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## మారుపేర్లు, విజిలెన్స్ కేసుల సమస్యలు పరిష్కరించాలి



**ఆర్‌జీ-1 జీఎం కార్యాలయం ఎదుట నేటి దీక్షకు ఐఎఫ్‌టీయూ సంపూర్ణ మద్దతు**

**అగ్నిధార న్యూస్,( రామగుండం):**

సింగరేణిలో మారుపేర్లు, విజిలెన్స్ పెండింగ్ కేసుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని గోదావరి లోయ బొగ్గుగని కార్మిక యూనియన్ (జీఎల్‌బీకేయూ-ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు కే. విశ్వనాథ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

సింగరేణిలో మారుపేర్ల బాధితులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆగస్టు 7న ఆర్‌జీ-1 జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న నిరసన దీక్షకు జీఎల్‌బీకేయూ (ఐఎఫ్‌టీయూ) సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. మారుపేర్లు, విజిలెన్స్ పెండింగ్ కేసుల కారణంగా ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్న బాధితుల సమస్యలను సింగరేణి యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం అత్యవసరంగా పరిష్కరించాలని కోరారు. అర్హులైన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బాధితుల సమస్యల పరిష్కారంలో యాజమాన్యం సానుకూలంగా స్పందించి వెంటనే చర్యలు చేపట్టాలని కే. విశ్వనాథ్ విజ్ఞప్తి చేశారు.

## దొంగతనాల ముఠా అరెస్ట్: 12 లక్షల విలువైన సొత్తు స్వాధీనం

**హైదరాబాద్ :** వివిధ కమిషనరేట్ల పరిధిలో వరుసగా ఇళ్ల తాళాలు పగులగొట్టి దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు అంతర్‌జిల్లా నేరస్థులతో పాటు ఒక చోరీ సొత్తు గ్రహీతను జూబ్లీహిల్స్ జోన్ టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి రూ. 12,00,000 విలువైన బంగారు, వెండి ఆభరణాలు, వాహనాలు మరియు పరికరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

